బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- ఈనెల 24న లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం
- డిసెంబర్ 1న రథోత్సవం
- డిసెంబర్ 5వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


రథోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులు (ఫైల్)


కొలువుదీరిన లక్ష్మీనారాయణ స్వామి

జైనథ్: ఆదిలాబాద్ జిల్లాలోని ఏకైక అతిప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దేశంలోని అతి ప్రాచీన ఆలయాల్లో ఒకటైన జైనథ్ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయానికి దశాబ్దాల చరిత్ర, మహోన్నతమైన ప్రాశస్త్యం ఉంది. వందలాది సంవత్సరాల నుంచి ప్రతీ ఏటా కార్తీకమాసంలో స్వామి వారి కల్యాణోత్సవంతో పాటు బ్రహ్మోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు, స్వామి వారిని దర్శించుకోవడానికి జిల్లా నలుమూల నుంచే కాక మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు తరలివస్తారు. కార్తీకమాసంలో బ్రహ్మోత్సవాల్లో స్వామి వారిని దర్శించుకుంటే సకల పాపలు తొలగిపోతాయని, కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

వైభవంగా బ్రహ్మోత్సవాలు..

లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని 11, 13వ శతాబ్దంలో జైనుల హయాంలో నిర్మించారని పేద్దలు చెబుతుంటారు. ఉన్నతమైన శిఖరం కలిగిన, గొప్ప శిల్పకళతో నిర్మించిన ఆలయం ముందు భాగంలో పెద్ద జలాశయం ఉంది. ప్రతీ ఏటా కార్తీక శుద్ధ ఏకదశి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలను అంరగంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈనెల 24 నుంచి డిసెంబర్ 5వరకు బ్రహ్మోత్సవాలు, జాతర నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి

ఈనెల 24న స్వామి వారి కల్యాణోత్సవం, డిసెంబర్ 1న రథోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవం తరువాత ఆలయ ఆవరణలో జాతర నిర్వహిస్తారు. కల్యాణోత్సవం అనంతరం ఐదు రోజుల పాటు స్వామి వారిని శేష, గజ, గరుడ, హన్మత్, అశ్వాది వాహనాలపై ఊరేగింపు నిర్వహిస్తారు. నవంబర్ 30న రాత్రి ఆలయ గోపురంపై అఖండ జ్యోతిని వెలిగించనున్నారు. మరుసటి రోజు సాయంత్రం డిసెంబర్ 1న స్వామి వారిని ప్రత్యేక రథంపై ప్రతిష్ఠించి గ్రామంలోని ప్రధాన వీధులగుండా శోభాయాత్ర నిర్వహించనున్నారు. ప్రతిఏటా భక్తుల తాకిడి పెరుగుతుండడంతో అవసరమైన వసతులు కల్పించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారిని దర్శించుకుంటే పుణ్యం కలుగుతుందని, మనోవాంఛలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

చిక్‌మాన్ ప్రాజెక్టు రీడిజైన్ చేసే బాధ్యత నాదే

- బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌జాదవ్


సిరికొండ: ఓటు అభ్యర్థిస్తున్న అనిల్‌జాదవ్

సిరికొండ: మండలంలోని చిక్‌మాన్ ప్రాజెక్టు రీడిజైన్ చేసే బాధ్యత నాదేనని బోథ్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే సోయం బాపూరావు కాంట్రాక్టర్ల వద్ద కమీషన్ తీసుకొని ప్రాజెక్టు డిజైన్‌ను మార్చి గేట్ కూడా నిర్మించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పెంటన్న, ఎక్బాల్, రాజన్న, చందు, మల్లేశ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: ఆశ్వీరదించండి అభివృద్ధి చేస్తానని అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు కాలనీలు, వారసంత, వ్యాపార సంస్థల్లో ప్రచారం చేశారు. మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఏనుగు కృష్ణారెడ్డి, లోక శిరీష్‌రెడ్డి ఉన్నారు.

గుడిహత్నూర్/బోథ్/తలమడుగు/నేరడిగొండ/తాంసి: ఆయా మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. గుడిహత్నూర్ మండలంలోని హర్కపల్లి, గర్కంపేట్, మల్కాపూర్, తెలంగ్‌రావ్‌గూడ, తోయగూడ, సోయంగూడ, రాఘాపూర్, లెండిగూడ, బొర్రమద్ది బీఆర్‌ఎస్ బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి గోడం నగేశ్ ప్రచారం చేశారు. అలాగే బోథ్ మండల కేంద్రంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, తలమడుగు మండల కేంద్రంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ చంటి, నేరడిగొండ మండలంలోని కుప్టి, కుమారి గ్రామాల్లో ఎంపీపీ రాథోడ్ సజన్, తాంసి మండలంలోని పొన్నారిలో జెడ్పీటీసీ రాజు ఎన్నికల ప్రచారం చేశారు. అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోరారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవకాశమిస్తే సేవకుడిలా పనిచేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్


ఇంద్రవెల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి: అవకాశం ఇవ్వండి.. సేవకుడిలా పని చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మండలంలోని గిన్నేర, బిక్కుతండా, శంకర్‌గూడ, చిన్న దనోర, దనోర గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని భీంనగర్, ప్రబుద్ధనగర్, బుద్ధనగర్‌లో ప్రచారం చేశారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, జెడ్పీ చైర్మన్ మహ్మద్ అంజద్, జాదవ్ శ్రీరాంనాయక్, మీర్జా జీలానిబేగ్, లఖన్, సుఫీయన్, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరితండా గ్రామంలో ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ చారులత రాథోడ్, శ్రీరాంనాయక్, ధరణి రాజేశ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, కిష్టునాయక్‌తండా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో, ప్రవేశపెట్టిన పథకాలు ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జెడ్పీటీసీ జానుబాయి తదితరులున్నారు.

సినీ యాక్టర్ల ప్రచారం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వారసంతలో జాన్సన్‌నాయక్ తరుపున తెలుగు సినీ యాక్టర్లు ప్రచారం చేశారు. హీరో గోపీచంద్ నటించిన యజ్ఞం సినిమాలో విలన్‌గా నటించిన విజయరంగరాజ్, ప్రొడ్యూసర్ బాలరాజుగౌడ్, తమిళ్, కన్నడ భోజపురి, తెలుగు సినిమాల్లో నటించిన రియల్ స్టార్ ఆజాద్ ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్ మాయ మాటలకు కరిగిపోవద్దు

- బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి 'సోయం'


నేరడిగొండ: మాట్లాడుతున్న సోయం బాపూరావు

నేరడిగొండ: బీఆర్‌ఎస్ మాయ మాటలకు కరిగిపోవద్దని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపూరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆరెపల్లి, లింగట్ల, గోండుగూడ, చింతగూడ, కొర్టికల్(బి), కొర్టికల్(కె), బంధంరేగడి, పాషాతండా, వాంకిడి, రోల్‌మామడ, యాపల్‌గూడ, గుత్పాల, నేరడిగొండలో ప్రచారం చేశారు. రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, తిత్రే నారాయణసింగ్, సాబ్లే ప్రేమ్‌సింగ్, సోసయ్య హీరాసింగ్, రాథోడ్ కమల్ సింగ్, తొడసం శంకర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: బీజేపీ ద్వారానే అభివృద్ధి సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. సోమవారం మండలంలోని మల్యాల్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, కదం బాబారావు, మచ్చ అజయ్, రమేశ్ పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని సోన్‌పెల్లిలో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు బోయిన్‌వాడ్ అమోల్ పాల్గొని సోయం బాపూరావుకు ఓటు వేయాలని కోరారు.

గుడిహత్నూర్: ప్రజాహితం కోరే పార్టీ బీజేపీ అని జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్ అన్నారు. సోమవారం మండలంలోని కొల్హారీ, ఇన్కర్‌గూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఎంపీపీ భరత్, జాడి సుభాష్, సింధే పరమేశ్వర్, శివ, పాండురంగ్ పాల్గొన్నారు.

తాంసి: డబుల్ ఇంజన్ సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి అన్నారు. సోమవారం అంబుగాం గ్రామంలో సోయం బాపూరావును గెలిపించాలని ప్రచారం చేశారు. మండల కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, సిరిగిరి మహేందర్, సుభాష్, స్వామి పాల్గొన్నారు.

బోథ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. తుకారం, వైస్ ఎంపీపీ లింబాజీ, సంజీవ రెడ్డి, అశోక్ రెడ్డి, రమేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ

- ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

బేల: కాంగ్రెస్ అధికారంలో రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సాంగిడి, కొత్త సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత 15ఏళ్లుగా ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేసిన ఎమ్మెల్యే జోగు రామన్నను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, సామ రూపేష్‌రెడ్డి, వాంఖడే వామన్, మడావి చంద్రకాంత్, గోడే అవినాష్, తాత్రే విపిన్, బోక్రే శంకర్ పాల్గొన్నారు.

అధికారం కోసం అబద్ధపు హామీలు

- ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జోగు రామన్న

బేల: బీజేపీ, కాంగ్రెస్ అధికారం కోసం అబద్ధపు హామీలు ఇస్తున్నాయని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న ఆరోపించారు. సోమవారం మండలంలోని జూనోని, కరోని(బి), తెలంగ్‌రావుగూడ, మాంగ్రుడ్, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఆసరా పింఛన్లు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాలు బీజేపీ పాలిత మహారాష్ట్రలో, కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చెప్పకుండానే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, ప్రమోద్‌రెడ్డి, జక్కుల మధుకర్, తాత్రే గంభీర్, సతీష్‌పవార్, తన్వీర్‌ఖాన్, రాథోడ్ రోహిదాస్, మంగేష్ పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపే పార్టీ కాదు

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్‌ఎస్ పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉండే పార్టీ అని, ప్రజలపై భారం మోపే పార్టీ కాదని ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్న అన్నారు. సోమవారం పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ చైర్మన్ రంజాని, పట్టణ కార్యదర్శి అష్రఫ్, యూనుస్ అక్బాని, ఏజాజ్, హైదర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

నేరడిగొండ: మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శోభన ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ రాథోడ్ సజన్ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి


పోలింగ్ చీటీలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇచ్చోడ: ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూపర్‌వైజర్లు నుర్‌సింగ్, సూర్యప్రకాశ్‌లు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని 11వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటా తిరుగుతూ పోలింగ్ చీటీలు పంపిణీ చేశారు. ప్రజాస్వామ్యదేశంలో ఓటు చాలా పవిత్రమైందన్నారు.

ఆర్థిక సాయం అందజేత


నగదు అందజేస్తున్న సిబ్బంది

నేరడిగొండ: మండలంలోని బుగ్గారం(బి) గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త కమలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అండగా నిలిచారు. ఇటీవల ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ ఆపరేషన్ జరగడంతో సోమవారం ఆమె నివాసానికి చేరుకొని పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం హుస్సేన్ చేతుల మీదుగా రూ.30వేల నగదు అందజేశారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, యువకులు

బోథ్: మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో మహిళలు, యువకులు, కాలనీవాసులు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజుయాదవ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మోదీ కమిటీ వేస్తామని ప్రకటించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల గంగయ్య, జెల్ల శివుడు, దీటి రమేశ్, అయిండ్ల మహేశ్, గడ్డం భుమేష్, రాజమణి, గంగమ్మ, గజ్జెల రవి పాల్గొన్నారు.

ఘనంగా బాలల హక్కుల దినోత్సవం


లోగో ఆకారంలో విద్యార్థినులు



బాలల హక్కుల గురించి వివరిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు దశరథ్, సమీరుల్లా ఖాన్‌లు అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం ప్రాముఖ్యత, పిల్లల కోసం కల్పించిన హక్కులను విద్యార్థులకు వివరించారు. పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్ అంతర్జాతీయ బాలల హక్కుల నేపథ్యం, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ 1098 కోఆర్డినేటర్ సతీష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంటె నర్సయ్య, డీసీపీవో రాజేంద్రప్రసాద్, మహిత ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ స్వర్ణలత బాలల హక్కులను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


కవాతులో పాల్గొన్న సీఐ వినోద్‌రెడ్డి, సిబ్బంది

నర్సాపూర్(జి): ధనం, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలని నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని టెంబుర్ని గ్రామంలో సోమవారం బీఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు రవీందర్, అరాఫత్ అలీ, బలగాలు, సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరం: అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ముథోల్ సీఐ వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని నగర్, గడ్‌చాంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. వారి వెంట లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, సిబ్బంది ఉన్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలో సోమవారం బీఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నిర్మల్‌రూరల్ సీఐ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వేచ్ఛగా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపైనే డ్రెయినేజీ పూడిక



ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం పరిధిలోని గంగన్నపేట గ్రామంలో డ్రెయినేజీ పూడికను రోడ్డు పక్కనే వదిలేశారు. మూడు వారాలు అవుతున్నా.. పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తీవ్ర దుర్గంధం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

డీసీసీబీ చైర్మన్ వాహనం తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆదిలాబాద్ బైపాస్ వద్ద సోమవారం సాయంత్రం ఆదిలాబాద్ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి వాహనాన్ని పోలీసు, ప్లెయింగ్ స్కాడ్ అధికారులు తనిఖీ చేశారు. ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్లుతుండగా.. తనిఖీ చేశారు. ఇందులో ఏఎస్సై చారి, స్కాడ్ బృందం అధికారి జాదవ్ కైలాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్‌పోలింగ్



ఓటు వేస్తున్న చిన్నారి

బోథ్: మండలంలోని సొనాల వివేకానంద పాఠశాలలో సోమవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా నమూనా ఎన్నికల్లో పాల్గొన్నారు. నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపరు ద్వారా ఓటు వేయడం, ఓట్ల లెక్కింపు, ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలోని విజేత ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఆకట్టుకుంది. చంద్రయాన్-3 మోడల్‌తోపాటు గడ్డి కోతయంత్రం, పర్యావరణ మార్పుల ప్రాజెక్టు, మానవ రక్తప్రసరణ వ్యవస్థ పనిచేసే విధానం, గణిత ఫార్ములా, బ్యాక్టీరియా ఇన్ మోడల్ ప్రజెంటేషన్‌ను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరిశీలించారు. డైరెక్టర్ మదిరె శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్, ఉపాధ్యాయులు సుధాకర్, సుస్మిత, నరేశ్, గౌరి తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి, కంకెట గ్రామాల్లో ఆలూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సీఈవో మల్లేశ్ ప్రారంభించారు. పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు.